క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

తవణంపల్లె: అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్‌ వినయ్‌కుమార్‌ తెలిపారు. గురువారం మండలంలోని పట్రపల్లెలో ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కాన్పులు చేసుకోవాలి



పీహెచ్‌సీలో కాన్పు చేసుకున్న మహిళ

తవణంపల్లె: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కాన్పులు చేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్‌ ప్రియాంక తెలిపారు. గురువారం మండలంలోని టి.పుత్తూరు దళితవాడకు చెందిన మహిళకు పురిటినొప్పులు రావడంతో ఏఎన్‌ఎం నవనీతమ్మ, ఆశాకార్యకర్త నాగభూషణ పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డాక్టర్‌ ప్రియాంక పర్యవేక్షణలో స్టాఫ్‌ నర్స్‌ శ్రీదేవి సుఖ కాన్పు చేశారు. పీహెచ్‌సీలో కాన్పులు చేయిస్తున్నామని గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

క్రీడాపరికరాల వితరణ



క్రీడాపరికరాలను ఇస్తున్న శ్యామలాదేవి

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలకు స్పందన ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు శ్యామలాదేవి క్రీడాపరికరాలను వితరణగా ఇచ్చారు. గురువారం ఆమె రూ.40 వేలు విలువచేసే వివిధ క్రీడాపరికరాలను పాఠశాలకు వచ్చి అందజేశారు. ఆమెకు హెచ్‌ఎం గిరిరాజా, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

2,200 ఎకరాల్లో ఈక్రాప్‌ బుకింగ్‌



టి. పుత్తూరు వద్ద వేరుశనగ పంట నమోదు

తవణంపల్లె: మండలంలో 2,200 ఎకరాల్లో పంట నమోదు (ఈక్రాప్‌ బుకింగ్‌) చేసినట్లు తవణంపల్లె వ్యవసాయాధికారి జి.ప్రవీణ్‌ వెల్లడించారు. 2023–24 సంవత్సరంలో మండలంలో ఇప్పటివరకు 2,200 ఎకరాలు పంట నమోదు చేశామని, మిగిలిన రైతులు పంట నమోదుకు సహకరించాలని కోరారు. సెప్టెంబర్‌ 15వ తేదీలోపు పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేస్తామన్నారు. నష్టపరిహారం పొందాలంటే విధిగా రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు.

నేల కొరిగిన వరిపంట



197రామాపురంలో నేలకొరిగిన వరిపంట

గుడిపాల: మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వరిపంట నేల కొరిగింది. మండలంలోని 197రామాపురం, కమ్మతిమ్మాపల్లె, కుప్పిగానిపల్లె, బుచ్చన్నకండిగ, సీఎంకండిగ, నారగల్లు ప్రాంతాల్లో రైతులు పండించిన వరిపంట నేల వాలడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. చేతికి వస్తున్న సమయంలో పంట నేల వాలడంతో దిగాలు చెందుతున్నారు. ఓవైపు వర్షంతోపాటు గాలి అధికంగా వీయడంతో వరిపంట మొత్తం నేల కొరిగింది. 70 ఎకరాలకు పైగా వరిపంట నేలవాలింది.

పోలీస్‌స్టేషన్‌ పరిశీలన



పోలీసులతో మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్‌

చిత్తూరు అర్బన్‌: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి కరుణకుమార్‌ చిత్తూరులోని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. గురువారం ఆయన పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని విచారణ గది, జీడీ పుస్తకం, ఇతర గదులను పరిశీలించారు. బాధితులు న్యాయం కోసం స్టేషన్‌కు వస్తే ఎలా ప్రవర్తించాలి? నిందితులను స్టేషన్‌లో ఉంచడంపై చట్టం ఏం చెబుతోంది, అరెస్ట్, రిమాండుపై సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐ ప్రసాద్‌ సూచనలు చేశారు. జడ్జి వెంట న్యాయశాఖ పర్యవేక్షణ అధికారిణి ప్రతిమ ఉన్నారు.

సారా పట్టివేత

చిత్తూరు రూరల్‌: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో గురువారం సారా పట్టుకున్నట్లు బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపారు. లక్ష్మీపతి (37) అనే వ్యక్తి నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారాతో పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఆమె పేర్కొన్నారు.

యాజమాన్యంతో అధిక దిగుబడి





- వర్షాకాలంలో మూడుసార్లు లోతుగా దున్నాలి
- చనిపోయిన చెట్ల స్థానంలో కొత్త అంట్లు నాటాలి
- జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌ రెడ్డి సూచనలు

ఐరాల: మామిడి పంట ముగిసిన తరుణంలో మామిడి తోటల యాజమాన్య పద్ధతుల్లో అంతర పంటల సాగు చాలా ముఖ్యం. తోటల్లో చెట్ల మధ్య ఖాళీ స్థలం దున్నటం వల్ల నేల గుల్లబారి భౌతిక స్థితి మెరుగుపడుతుంది. నేలలో గాలి ప్రసరించడం వల్ల కలుపు మొక్కల బెడద ఉండదు. తద్వారా నీటికి, పోషకాల వినియోగానికి పోటీ ఉండదు. అంతేగాక నేలలోనే నివసించే హానికర పురుగులు నశిస్తాయి. కోత అనంతరం మామిడిలో చేపట్టాల్సిన పనులను, వివిధ కార్యక్రమాలను జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి వివరాలు తెలిపారు. కాపునకు వచ్చిన తోటల్లో తొలకరి వర్షాలకు జూన్‌, జూలై నెలల్లో మొదటిసారి, ఆగస్టులో రెండోసారి, అక్టోబర్‌–నవంబర్‌ నెలల్లో మూడోసారి భూమిలో పదును చూసుకుని దున్నుకోవాలి. మొదటి దుక్కికి వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేలకోత అంతగా ఉండదు. రెండో దుక్కికి కలుపు నివారణ అవుతుంది. మూడో దుక్కి పూత రావడానికి దోహదపడుతుంది. నేలలో ఉండే పిండి పురుగులు, పండు ఈగ తాలూకు కోశస్థ దశలు నశిస్తాయి. దుక్కి వాలుకు అడ్డంగా దున్నాలి. తోటలో భూమి వాలును బట్టి ప్రతి 10–15 చెట్లకు చుట్టూ పెద్ద అడ్డకట్లు వేయాలి. దీనివల్ల వర్షపు నీరు, సత్తువ బయటకు కొట్టుకుపోదు. నేలలో తేమ బాగా ఉంటుంది. ఎండుపుల్ల పడదు. వేరుకుళ్లు అంతా ఆశించదు. ఎరువులు ముఖ్యంగా నత్రసని, భాస్వరం, పొటాస్‌ పోషకాల్ని సకాలంలో సిఫారసు చేసిన మోతాదులో వేయాలి. వయస్సును బట్టి ఒక్కొక్క చెట్టుకు ఒక సంవత్సరానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలి. మామిడి తోటల్లో సూక్ష్మ ధాతు లోపాలు కనిపిస్తుంటాయి. కాయలు కోయడం పూర్తయిన వెంటనే చెట్లు పుంజుకోవడానికి జింక్‌ సల్ఫేట్‌ 5 గ్రాములు, యూరియా 10 గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలి. ఆ తర్వాత సూక్ష్మ ధాతువులైన జింక్‌, మెగ్నీషియం, బోరాన్‌, మాంగనీస్‌ల మిశ్రమ ద్రావణాన్ని తయారు చేసి జూలై, ఆగస్టు నెలల్లో చెట్లు కొత్త ఆకు తొడిగేటప్పుడు రెండవసారి పిచికారి చేయాలి. తోటల్లో అక్కడక్కడ చెట్లు చనిపోయి ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీల్లో మొక్క పెట్టేచోట మళ్లీ ఒక మీటరు పొడవు, వెడల్పు, ఒక మీటరు లోతు సైజులో గుంతలు తీయాలి. గుంతలు తవ్వేటప్పుడు పై అరమీటరు లోతు మట్టిని మరోవైపు వేర్వేరుగా కుప్పలు వేయాలి. పైమట్టికి 100 కిలోల పశువుల ఎరువు లేదా 30 కిలోల వర్మీ కంపోస్టు, 2 కిలోల సూపర్‌ ఫాస్ఫేట్‌ కలపాలి. చెదలు ఆశించకుండా 100 గ్రాముల లిండేన్‌, ఫాలిడాన్‌ 5 శాతం పొడి మందును, మట్టి ఎరువు మిశ్రమానికి కలపాలి. గుంతను మొదట ఈ మిశ్రమంలో నింపాలి. తక్కువైతే పక్కనున్న మట్టితో గుంత నింపుకుని నాటేముందు రోజు గుంతకు నీరు పెడితే పోత మన్ను బాగా కుంగుతుంది. గుంత మధ్య భాగంలో కొంచెం మట్టిని తోడి, అంటు వేర్లకున్న మట్టి కదలకుండా, రాలకుండా ముద్దలా ఉంచి మరికొంత మట్టిని చేర్చాలి.

ప్రభుత్వం సాయంతో తీరిన కష్టాలు



ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. అధికారుల సూచనలు పాటిస్తూ సస్య రక్షణ పద్ధతులు పాటిస్తున్నాను. మామిడికాయల దిగుబడి కూడా బాగా వస్తే ఆర్థికంగా లబ్ధిచేకూరుతుంది. గతంలో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ప్రస్తుతం ఆ బాధలు తీరాయి.

– విజయ్‌కుమార్‌రెడ్డి, వినాయకపురం, ఐరాల

రైతులకు అవగాహన



మామిడి పంట సస్యరక్షణ కోసం ముందస్తుగానే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు సూచనలు క్రమం తప్పకుండా పాటిస్తున్నారు. తోటబడి కార్యక్రమం సైతం గ్రామాల్లో నిర్వహిస్తున్నాం. మామిడి పూత, పిందె దశలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని రైతులకు తెలియజేస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి

చౌడేపల్లె: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్‌ సీడీపీఓ రాజేశ్వరి అన్నారు. గురువారం చౌడేపల్లెలో మండలంలోని 66 సెంటర్ల అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు, బాలింతలు రక్తహీనత సమస్యను అధిగమించడానికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం పొందాలన్నారు. 3కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర్ధలీటర్‌ నూనె, 2.5లీటర్ల పాలు, 13 కోడి గుడ్లు, రాగిపిండి2 కేజీ, ఎండు ఖర్జూరం 250 గ్రాములు, వేరుశనగ చిక్కీలు 250 గ్రాములు, బెల్లం 250గ్రాములు, జొన్నపిండి కేజీ చొప్పున టేక్‌ హోమ్‌ రేషన్‌ లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. వీటిని ప్రతినెలా క్రమం తప్పకుండా 15వ తేది లోపు అర్హత ఉన్న వారికే అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సిబ్బంది సమష్టికృషి చేయాలన్నారు. హైరిస్క్‌ ప్రెగ్నెన్సీ కేసులపై దృష్టి సారించి మాతా–శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అనంతరం కేంద్రాల వారీగా నివేదికలపై సమీక్షించి వివరాలు సేకరించారు. సూపర్‌వైజర్లు సులోచన, రమాదేవి పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌ అదాలత్‌

– సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీనివాసరావు



పలమనేరు: పట్టణ సమీపంలోని ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ కోర్టు ప్రాంగణంలో సెప్టెంబర్‌ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీనివాసరావు కోరారు. స్థానిక కోర్టులో గురువారం ఆయన పోలీసులు, న్యాయవాదులతో మాట్లాడారు. ఎలాంటి పెండింగ్‌ కేసులునైనా జాతీయ లోక్‌ అదాలత్‌తో రాజీ చేసుకునే వెసులుబాటు ఉందని, కక్షిదారులు పంతాలు, పట్టింపులకు పోకుండా కేసులను రాజీ చేసుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రి–లిటిగేషన్‌, చెక్‌బౌన్స్‌, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్‌, క్రిమినల్‌ కేసులను రాజీ చేసుకునేందుకు, కేసుల సత్వర పరిష్కారానికి ఇది మంచి వేదిక అన్నారు.



అగరంపల్లె క్రాస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు



టేకుమందలో జాతీయజెండాతో ర్యాలీ

చంద్రయాన్‌–3 విజయవంతంపై

మిన్నంటిన సంబరాలు

కాణిపాకం(యాదమరి): చంద్రయాన్‌–3 విజయవంతం కావడంతో గురువారం అగరంపల్లె క్రాస్‌, సచివాలయం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు ఆధ్వర్యంలో జాతీయజెండాలతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. సర్పంచ్‌ శాంతిసాగర్‌ రెడ్డి, ఐరాల మండల కన్వీనర్‌ బుజ్జిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కాణిపాకం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే, నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అగరంపల్లె వద్ద మానవహారం నిర్వహించారు.

యాదమరిలో..

యాదమరి: కాశిరాళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు గిరిరాజ, కనకాచ్చారి, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: టేకుమంద జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హెచ్‌ఎం అబ్దుల్‌సుభాన్‌ ఆధ్వర్యంలో గురువారం చంద్రయాన్‌–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి వంద అడుగుల జాతీయజెండాతో విద్యార్థులు ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ ర్యాలీ చేశారు. సెయింట్‌ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీఐ రాగరాజరావు పాల్గొన్నారు.



యాదమరిలో ర్యాలీ



కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో..



మానవహారంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..



వరదరాజులపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు

యాదమరి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గడపకు గడపకు వస్తున్నామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు అన్నారు. గురువారం మండలంలోని వరదరాజులపల్లె, దళితవాడ, బుడిగిపెంట కట్టకిందవూరు గ్రామాల్లో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ధనంజయరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేశారని, నిధులతో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్‌ ఎంపీపీ రవీంద్రబాబు, సర్పంచ్‌ పుష్పావతి, నేతలు మనోహర్‌రెడ్డి, మనోహరన్‌, బాలకృష్ణారెడ్డి, పట్టాభి, భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్‌ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్‌, వ్యవసాయశాఖ ఏఓ చరితారెడ్డి, వెలుగు ఏపీఎం కల్పలత, ఎంఈఓ రుక్మిణి, విద్యుత్‌ శాఖ ఏఈ గుర్రప్ప, పీఆర్‌ ఏఈ ప్రసాద్‌ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం..

వరదరాజులపల్లె పంచాయతీలోని చెన్నారెడ్డిపల్లె, సంతగేటు గ్రామాల్లో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజ్‌ తెలిపారు. ఉదయం 7 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బురదచల్లాలనే భూసమస్యను తీసుకొచ్చారు

- డీసీసీబీ చైర్మన్‌ రెడ్డెమ్మ భూఆక్రమణ అవాస్తవం
- విలేకరుల సమావేశంలో శేషగౌడ



మాట్లాడుతున్న శేషగౌడ

చిత్తూరు రూరల్‌: డీసీసీబీ చైర్మన్‌ రెడ్డెమ్మ, మరిది భూమిని ఆక్రమించుకున్నారన్నది..ముమ్మాటికీ అవాస్తమని, కేవలం రెడ్డెమ్మ కుటుంబంపై బురద చల్లాలనే భూ సమస్యను తీసుకొచ్చారని బైరెడ్డిపల్లికి చెందిన శేషగౌడ అన్నారు. చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బైరెడ్డిపల్లిలో భూసమస్య తమదైతే.. డీసీసీబీ చైర్మన్‌ రెడ్డెమ్మ మరిది భూమిని ఆక్రమించుకున్నట్లు శ్యామలమ్మ చెప్పినవన్నీ అవాస్తమన్నారు. భూసమస్యకు సంబంధించి రెడ్డెమ్మ కుటుంబానికి ఎలాంటి సబంధం లేదన్నారు. కేవలం బురదచల్లాలనే వారిని ఈ భూసమస్యలోకి లాగుతున్నారని చెప్పారు. తన ఆధీనంలో ఉన్న 47 సెంట్ల భూమిలో సిమెంట్‌ ఇటుకల ఫ్యాక్టరీకి నిర్మించుకుని జీవిస్తున్నానన్నారు. కొన్ని కారణాల వల్ల ఆ ఫ్యాక్టరీని వెంకటేష్‌ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చానన్నారు. కానీ శ్యామలమ్మ భూవిషయంలో తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

స్టాక్‌ రిజిస్టర్‌ ఎక్కడ?

- ఎంపీడీఓ గౌరి



మధ్యాహ్న భోజన వివరాలను తెలుసుకుంటున్న ఎంపీడీఓ

పూతలపట్టు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులను పాఠశాల సిబ్బంది తప్పకుండా స్టాక్‌ రిజిస్టర్‌లో నమోదుచేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. గురువారం మండలంలోని పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ గౌరి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులచే భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అక్కడ రుచిచూచి బాగుందని వంట సిబ్బందిని అభినందించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎంను స్టాక్‌ రిజిస్టర్‌ను అడగ్గా అందులో 19వ తేదీ నుంచి నేటి వరకు స్టాక్‌ వివరాలను నమోదుచేయలేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వద్దని ఆమె తెలిపారు. అనంతరం సంబంధిత ఉన్నతాధికారులకు రిపోర్టును అందజేశారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్‌ రష్మిత



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్‌ హరి

గుడిపాల: ఇంటి ముంగిటకే వెద్యసేవలని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు హరి, రష్మిత అన్నారు. గురువారం కట్టకిందపల్లె, వెంగమాంబపురం గ్రామాల్లో 104 వైద్యసేవలు ఏర్పాటు చేశారు. 125 మంది వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యసిబ్బంది నరసింహులు, హైమావతి, కవిత, రీటా, కోమల, బాబు, నిత్య, పంకజ, కిషోర్‌ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు సోలార్‌ లైట్లు



సోలార్‌ లైట్లను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె : తోపుడు బండ్ల వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఉచితంగా సోలార్‌ లైట్లను అందజేశారు. గురువారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలానికి కేటాయించిన సోలార్‌ లైట్లను 50 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాత్రి సమయాల్లో వ్యాపారులకు ఈ లైట్లు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. మంత్రి, ఎంపీ మిథున్‌రెడ్డికి వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్‌ ఎంపీపీలు సుదాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్‌, సింగిల్‌విండో చెర్మన్‌ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుధాకర్‌, ఈఓ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఇద్దరి అరెస్ట్‌

పలమనేరు: కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు డీటీఎఫ్‌ ఎస్‌ఐ మాధవస్వామి గురువారం తెలిపారు. ఆయన కథనం..కీల పట్ల క్రాస్‌ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో కాపు కాశారు. అక్కడ గంగవరం మండలం బొమ్మనపల్లెకు చెందిన గుర్రప్ప(65), కీలపట్లకు చెందిన బెస్త కార్తీక్‌(30)లను అరెస్ట్‌ చేసి, వారి నుంచి 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం తిప్పిదొడ్డి నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి స్థానికంగా అధి క ధరలకు వీరు విక్రయిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ దాడుల్లో ఎస్‌ఐ మస్తాన్‌వలి, సిబ్బంది గౌతమ్‌, నాగరాజు పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న సెబ్‌ డీటీఎఫ్‌ అధికారులు